www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 29 మే 2023
5
ఏలూరు

డిఇఒ కార్యాలయం వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యాన నిరసన

ఆందోళన చేస్తున్న ఫ్యాప్టో నాయకులు

ఏలూరు: సమస్యల పరిష్కారం కోరుతూ ఫ్యాప్టో పిలుపు మేరకు ఉపాధ్యాయులు స్థానిక డిఇఒ కార్యాలయం వద్ద ఆదివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని కేడర్ల ఉద్యోగోన్నతులు మాన్యువల్‌గా మాత్రమే నిర్వహించాలని, బదిలీల్లో ఉన్నటు వంటి అసంబద్ధాలను తొలగించి, బ్లాకింగ్ లేకుండా అన్ని ఖాళీలను ప్రదర్శించాలని నినదించారు. కార్యక్రమానికి నేతలు పిబివిఎన్ఎల్.నారాయణ, ఆర్.రవికుమార్, ఎస్‌కె.రంగావలీ, డివి.రమణ, బి.సాయిరాజ్, కె.కాంతారావు, కె.సురేష్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.నరహరి నాయకత్వం వహించారు.

కొల్లేరులో.. గద్దలు..!

- యథేచ్ఛగా చెరువుల తవ్వకాలకు యత్నం
- చోద్యం చూస్తున్న అటవీశాఖ అధికారులు
- కొల్లేరులోకి ప్రవేశించిన పొక్లెయిన్లను సీజ్ చేయడంలో నిర్లక్ష్యం

మండవల్లి మండలంలో కొల్లేరులో చెరువు తవ్వేందుకు ఏర్పాటు చేసిన గట్టు

ప్రజాశక్తి - మండవల్లి

కొల్లేరుపై బడాబాబుల కన్ను పడింది. అవకాశం దొరికితే చెరువులు తవ్వేందుకు వెనుకాడటం లేదు. ఈ నేపథ్యంలో కొందరు అక్రమార్కులు చెరువులు తవ్వేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. యథేచ్ఛగా కొల్లేరులోకి పొక్లెయిన్లతో వెళ్లి చెరువులు తవ్వేందుకు ఈనెల 27వ తేదీన వెళ్లారు. అయితే అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు తూతూమంత్రంగా అడ్డుకున్నారు. అభయారణ్యంలోకి పొక్లెయిన్లు ప్రవేశించి గట్లు వేసినప్పటికీ కనీసం సీజ్ చెయ్యకపోవడంపై అటవీశాఖ అధికారుల తీరుపై పలుఅనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా కొల్లేరులోకి జెసిబిలు, పొక్లెయిన్లు ప్రవేశించి అక్రమంగా చెరువులు తవ్వేందుకు ప్రయత్నిస్తే వాటిని సీజ్ చేసి సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేయాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ అలాంటిదేమీ చేయకపోవడం గమనార్హం. అటవీశాఖ అధికారుల తీరు వెనుక లక్షలాది రూపాయలు చేతులు మారాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. మణుగులూరు కొల్లేరు అభయారణ్యంలో సుమారు 400 ఎకరాల్లో చెరువులు తవ్వేందుకు ఓ బడాబాబు రాజకీయ నాయకుల అండదండలతో రంగం సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. ఈ తవ్వకాలను అడ్డుకోకుండా సంబంధిత అధికారులకు ముందుగానే తాయిలాలు ముట్టచెప్పినట్లు తెలిసింది. ఈ క్రమంలో పదుల సంఖ్యలో భారీ పొక్లెయిన్లను దింపి కొల్లేరు అభయారణ్యంలో మూడు తూముల వద్ద ఉన్న వడ్డీకోడు దగ్గర నుండి చెరువు తవ్వకాలు ప్రారంభించి గట్లు వేయడం ప్రారంభించాడు. అయితే ఈ సమాచారం అందుకున్న అటవీ శాఖ సెక్షన్ అధికారి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పనులను నిలుపుదల చేశారు. అయితే అటవీ శాఖ అధికారులు ఏం చెప్పారో ఏమో తెలియదు గానీ పొక్లెయిన్లను సీజ్ చేయకుండా అభయారణ్యం నుండి చాకచక్యంగా తప్పించారు.

అంతేకాక ఈ చెరువుల తవ్వకానికి యత్నించిన కోనపురాజు రంగరాజు తన అనుచరులు కలిసి తవ్వకాలను అడ్డుకున్న అభయారణ్యంలో విధులు నిర్వహిస్తున్న తమపై దౌర్జన్యానికి దిగి అడ్డగించి, విధులకు ఆటకం కలిగించి దుర్భాషలాడారని మండవల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం కొసమెరుపు. ఇదిలా ఉంటే కొల్లేరు ఆపరేషన్ అనంతరం చిత్తడి నేలలను పరిరక్షించే బాధ్యతను అటవీశాఖకు అప్పగించారు. తిరిగి ఆక్రమణలకు గురికాకుండా కొల్లేరులోకి అనుమతిని నిషేధిస్తూ కఠిన ఆంక్షలు విధించారు. అయినప్పటికీ కొల్లేరు అభయారణ్యంలోకి పదుల సంఖ్యలో పొక్లెయిన్లు ఎలా వెళ్లాయి అనే ప్రశ్నలు సర్వత్రా తలెత్తుతున్నాయి. దీంతో అటవీ శాఖ అధికారుల తీరుపై అనేక అనుమానాలు రేకెత్తుతున్నాయి. పదుల సంఖ్యలో పొక్లెయిన్లు కొల్లేరులోకి వెళ్లినప్పటికీ కేవలం ఆరు ప్రొక్లెయిన్లను మాత్రమే రిపోర్టులో చేర్చడం వాటిని కూడా సీజ్ చేయకపోవడం, ప్రాణ రక్షణ కల్పించాలని రిపోర్టులో కోరడం ఆ అనుమానాలకు మరింత బలం చేకూరుతుంది. తొమ్మిదేళ్ల క్రితమే ఇదే ప్రాంతంలో చెరువు తవ్వేందుకు విఫలయత్నం సాగింది. సుమారు 40 యంత్రాలతో కొల్లేరు అభయారణ్యంలో కొంతమేర గట్లు వేశారు. అయితే అప్పటి అటవీ శాఖ అధికారుల్లో నెలకొన్న నిర్లక్ష్యం వల్ల ఆ గట్లను ధ్వంసం చేయకపోవడంతో ఆ గట్టును ఆధారం చేసుకుని అంచలంచలుగా చెరువు పూర్తి చేసే చర్యలు నేటికీ సాగుతూనే ఉన్నాయి. దీంతో చెరువు పూర్తి చేసి కొల్లేరును ఆక్రమించాలనే ఆ వ్యక్తి తపన ఏ స్థాయిలో ఉందనేది స్పష్టమవుతుంది. ఈ క్రమంలోనే అధికారులు కూడా కాసుల మోజుతో విధుల్లో ఎంత నిర్లక్ష్యంగా నిర్వహిస్తున్నారనేది తేటతెల్లమవుతుంది. అయితే ముడుపులు, రాజకీయ ముసుగు బడాబాబు చెరువు తవ్వకునేలా సహకరిస్తాయా? కొల్లేరు అభయారణ్యాన్ని పరిరక్షించడానికి ఉద్యోగాలు చేస్తున్నామని గుర్తెరిగి పరిరక్షిస్తారో తెలియాలంటే వేచి చూడాల్సి ఉంది.

దీనిపై అటవీశాఖ సెక్షన్ అధికారి రామ్మోహన్‌సింగ్‌ని వివరణ కోరగా ఆయన తీవ్రనిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. కొల్లేరులో నిబంధనలు, చట్టాలు ఏమీ లేవని, తమరు కూడా మాట్లాడొద్దంటూ చొప్పుకొచ్చారు. అంతేకాక పత్రికలో రాయకూడని పదజాలంతో మాట్లాడటంపై ఆయన వ్యక్తిత్వం ఎలాంటిదో అర్థమవుతుంది. ఒక బాధ్యతగల ఉద్యోగి తీరు ఇలా ఉండటంపై ఆయనను ఎవరు? ఏ స్థాయిలో మభ్యపెట్టారోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు, కొల్లేరువాసులు కోరుతున్నారు.

ఏజెన్సీవాసుల ఆరోగ్య పరిరక్షణకు

ప్రత్యేక చర్యలు

డిప్యూటీ డిఎంహెచ్ఒ ఐ.రాజీవ్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పశ్చిమ ఏజెన్సీ ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ డిఎంహెచ్ఒ ఐ.రాజీవ్ తెలిపారు. ఏజెన్సీలో వ్యాధుల నివారణకు చేపట్టిన చర్యలపై తీసుకుంటున్న చర్యలపై ప్రజాశక్తి ముఖాముఖిలో పలు వివరాలు వెల్లడించారు.

ప్రశ్న: ఏజెన్సీ ప్రాంతంలో ఎక్కువగా వచ్చే సీజనల్ వ్యాధులేమిటి?

రానున్న జూన్ నుంచి ప్రారంభమయ్యే వర్షాకాలం సీజన్లో బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం తదితర మండలాల్లో మలేరియా, టైఫాయిడ్, రక్తహీనత, కామెర్లు వంటి వ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది.

ప్రశ్న: మలేరియా ఎక్కువగా ప్రబలే గ్రామాలేవి?

మలేరియా ఎక్కువగా వర్షాకాలంలో వస్తోంది. ఏజెన్సీలో పిఆర్‌గూడెం, బుట్టాయగూడెం, దొరమామిడి, అంతర్వేదిగూడెం, కోయిదా, కుక్కునూరు, ఎల్అండ్‌డి పేటల్లో ఎక్కువగా మలేరియా కేసులు నమోదవుతున్నాయి.

ప్రశ్న: ఏజెన్సీలో మలేరియా నివారణకు తీసుకుంటున్న చర్యలేమిటి?

బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం మండలాల్లో రెండు విడతలుగా మలాథియన్ స్ప్రే చేస్తాం. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ఎసిఎం స్ప్రే చేయిస్తాం. ఇప్పటికే బుట్టాయగూడెం, పోలవరం మండలాల్లో మొదటి విడతగా మలాథియన్ స్ప్రే ప్రారంభించాం. అలాగే మలేరియా బారిన పడకుండా దోమతెరలు వాడాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. మురుగుగుంటలు, నీటి నిలువ ప్రదేశాలు లేకుండా చూసుకోవాలని సూచిస్తున్నాం.

ప్రశ్న: టైఫాయిడ్ నివారణకు చర్యలేమిటి?

తాగునీటి వల్ల టైఫాయిడ్ ఎక్కువగా వస్తోంది. దీని నివారణకు మంచినీటి ట్యాంకులు శుభ్రం చేసుకోవాలని క్లోరిన్ టాబ్లెట్స్ ఇస్తున్నాం. వరద ప్రాంతాలైన వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో టైఫాయిడ్ ఎక్కువ వస్తోంది. కాచి చల్లార్చిన నీటినే తాగాలని చెబుతున్నాం. నిల్వ ఉన్న ఆహారం తీసుకోకూడదు అని అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న: రక్తహీనత నివారణకు చర్యలేమైనా చేపడుతున్నారా?

మహిళల్లో 15 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల వారిలో, గర్భిణీల్లో రక్తహీనత ఎక్కువగా వస్తోంది. మలేరియా బారిన పడిన వారికి కూడా రక్తహీనత ఎక్కువగా ఉంటుంది. దీని నివారణకు ఏజెన్సీ ప్రాంతాల్లో ఐరన్ టాబ్లెట్స్ పంపిణీ చేస్తున్నాం. బెల్లంతో తయారుచేసిన తిను బండారాలను తినమని చెబుతూ రెడ్‌మీట్ భోజనంలో ఎక్కువగా ఉండేలా చూసుకోవాలని సూచిస్తున్నాం. రక్తహీనత ఎక్కువగా ఉన్న వారికి ఐరన్ శుక్రస్ ఇంజెక్షన్స్ ద్వారా రక్తం పెరగడానికి చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: ఐటిడిఎ పరిధి నుంచి వైద్యం నిమిత్తం రోగులను ఏఏ పట్టణాలకు పంపుతున్నారు?

బుట్టాయగూడెం, పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు, జీలుగుమిల్లి, పోలవరం మండలాల్లో ప్రజలకు 15 పిహెచ్‌సిలు, రెండు సిహెచ్‌సిల ద్వారా ఐటిడిఎ పరిధిలో వైద్యం అందిస్తున్నాం. ఏమైనా మెరుగైన వైద్యం అవసరమైతే జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి లేదా ఏలూరు ఆసుపత్రికి పంపుతున్నాం. లేనిపక్షంలో ఆరోగ్య శ్రీ ద్వారా ప్రయివేటు ఆసుపత్రులకు పంపించి మెరుగైన వైద్యం అందేటట్లు చూస్తున్నాం.

ప్రశ్న: ఐటిడిఎ పరిధిలో వైద్యుల కొరత ఉందా?

ఐటిడిఎ కెఆర్‌పురం పరిధిలో బుట్టాయగూడెం, పోలవరం సిహెచ్‌సిల్లో గైనకాలజిస్ట్, జనరల్ సర్జరీ, పిల్లల డాక్టర్, మత్తు డాక్టర్, దంత వైద్యులు ఇద్దరు, జనరల్ ఎంబిబిఎస్ డాక్టర్లు అందుబాటులో ఉన్నారు. 15 పిహెచ్‌సిల్లో ఒక్కో పిహెచ్‌సికి ఇద్దరు డాక్టర్లు చొప్పున అందుబాటులో ఉన్నారు. ఈ ఆస్పత్రుల ద్వారా మెరుగైన వైద్యం పొంది గిరిజనులు ఆరోగ్యంగా ఉండాలనేది మా ఆకాంక్ష.

2.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

జిల్లాలో రబీ పంట కాలం 2022-23కు సంబంధించిన ధాన్యం సేకరణ ప్రక్రియ ముగింపు దశకు చేరుకుందని జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 156 రైతు భరోసా కేంద్రాలను ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా గుర్తించి 87 కొనుగోలు సహాయక కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఏప్రిల్ 16వ తేదీ నుండి ప్రారంభించామని తెలిపారు. ఈనెల 27వ తేదీ నాటికి 18,438 మంది రైతుల నుంచి రూ.430 కోట్ల విలువైన 2.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కనీస మద్దతు ధరకు సేకరించామని తెలిపారు. ప్రస్తుతం రూ.367 కోట్లు రైతుల వ్యక్తిగత ఖాతాల్లో జమచేశామని, రూ.63 కోట్లు బ్యాంకుల్లో జమచేసే ప్రక్రియలో ఉన్నాయని, సేకరించిన ధాన్యం జిల్లాలోని వివిధ రైస్ మిల్లులకు రవాణా చేశామని పేర్కొన్నారు. రైస్ మిల్లులకు తరలించబడిన ధాన్యం నిర్ణీత సమయంలో మర ఆడించి కస్టమ్ మిల్లింగ్ రైస్‌గా ఎప్పటికప్పుడు భారత ఆహార సంస్థ, ఎపి పౌర సరఫరాల సంస్థ ద్వారా ప్రభుత్వానికి డెలివరీ చేస్తున్నట్లు తెలిపారు. సంబంధిత ప్రభుత్వ అధికారులు రైస్ మిల్లులను తనిఖీ చేస్తారని, మిల్లుల్లో ధాన్యం నిల్వల వివరాలను జాగ్రత్తగా నిర్వహించాలని, ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను డెలివరీ చేయాలని తెలిపారు.

మాట్లాడుతున్న ఫైర్ డిజిపి సునీల్‌కుమార్

దళితవాడలను ప్రత్యేక పంచాయతీలు చేయాలి

ఫైర్ డిజిపి సునీల్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రతి వెయ్యి మంది జనాభా కలిగిన దళితవాడలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని ఎపి అగ్నిమాపక శాఖ డిజిపి పివి.సునీల్‌కుమార్ అన్నారు. లింగపాలెం మండలం జి.కొత్తపల్లిపడమర మాలపల్లిలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహన్ని ఆయన ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ ప్రత్యేక దళితవాడలను పంచాయతీలుగా చేస్తే ఆ గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రత్యేక దళిత పంచాయతీలకు అంతా సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎయిమ్ రాష్ట్ర కన్వీనర్ మాదిరి రాంబాబు, సిఐ రాజేష్, ఎయిమ్ డిజిటల్ కన్వీనర్ పవన్‌కుమార్, పశ్చిమగోదావరి జిల్లా డిజిటల్ కన్వీనర్ చోడే అనిల్ తదితరులు పాల్గొన్నారు.

చుక్కల్లో చికెన్ ధరలు

కిలో రూ.300కు చేరిక

ప్రజాశక్తి - ముదినేపల్లి

బ్రాయిలర్ కోడి ధర కొండెక్కింది. దీంతో చికెన్ ధరలు చుక్కలనంటుతున్నాయి. గతేడాది కంటే ఈ ఏడాది చికెన్ ధర బాగా పెరిగింది. గత నెల కిలో రూ.160 ఉండగా ప్రస్తుతం రూ.280 నుంచి రూ.300 వరకు విక్రయిస్తున్నారు. స్కిన్ లెస్ రూ.300 నుంచి రూ.320 వరకు విక్రయిస్తున్నారు. ఒకవైపు కోళ్ల దాణా ధరలు పెరిగిపోవడం, మరోవైపు మండుతున్న ఎండలతో బ్రాయిలర్ కోళ్ల ఉత్పత్తి తగ్గుతోంది. గత రెండేళ్లుగా వేసవి ఎండలకు ఎక్కువ సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడ్డాయి. దీంతో కోళ్ల రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారు. ప్రస్తుతం ఉన్న ధర గత రెండేళ్లలో ఎప్పుడూ లేదు. గతనెల లైవ్ కోడి కిలో రూ.80 ఉండగా, ప్రస్తుతం రూ.150 వరకు పలుకుతోంది. చికెన్ డిమాండ్‌కు తగ్గట్టుగా కోళ్ల ఉత్పత్తి లేదు. దీంతో గుడ్లు ధర నిలకడగా ఉన్నా చికెన్ ధరలు మాత్రం చుక్కల్లో ఉన్నాయి. అధిక ఉష్ణోగ్రతలకు ఒకో కోడి కిలోన్నరకు మించి బరువు పెరగడం లేదు. దీనికితోడు ఉత్పత్తి కూడ భారీగా పడిపోయిందని వ్యాపారులు చెబుతున్నారు. గతంలో కోడి పిల్ల రేటు హేచరీల్లో రూ.20 వరకూ ఉంటే, ప్రస్తుతం పిల్ల ధర రూ.27కు చేరింది. పెరిగిన ధర మాంసం ప్రియులకు ఇబ్బందిగా మారినప్పటికీ కోళ్ల రైతులు మాత్రం పెరిగిన ధరతో ఆనందంగా ఉన్నారు.

పాలకొల్లు: మండుటెండతోపాటు పట్టణంలో చికెన్ ధర కొండెక్కింది. పది రోజుల క్రితం వరకూ కిలో రూ.200 నుంచి రూ.220 వరకూ ఉన్న చికెన్ ధర ఆదివారం రూ.270 నుంచి రూ.300 వరకూ ఎగబాకింది. దీంతో మాంసాహారులు పెరిగిన ధరలకు గగ్గోలు పెడుతున్నారు. ఎండల ప్రభావంతో ఈ వారం కిలో ధర రూ.300 దాటుతుందని వ్యాపారులు చెబుతున్నారు. కోడి గుడ్డు ధర కూడా వారం రోజుల ముందు రూ.5 ఉండేది. అయితే ఎండకు కోళ్లు ఎక్కువగా చనిపోవడంతో కోడిగుడ్డు రేటు కూడా రూ.6కు పెరిగింది.



నేడు జర్నలిస్టుల డిమాండ్స్ డే

ఎపిడబ్ల్యూజెఎఫ్ ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు

జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 29న జర్నలిస్టుల్ డిమాండ్స్ డే నిర్వహించాలని ఎపిడబ్ల్యూజెఎఫ్ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా సోమవారం ఉదయం 11 గంటలకు ఏలూరులోని జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ ఎడి కార్యాలయం వద్ద జర్నలిస్టుల నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఫెడరేషన్ కార్యనిర్వాహక కమిటీ ప్రతినిధులు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పిస్తామని, ఈ కార్యక్రమాల్లో జర్నలిస్టులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు యథావిధిగా స్పందన

ప్రజాశక్తి - ఏలూరు

స్థానిక జిల్లా కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో ఈ నెల 29వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి 'స్పందన' కార్యక్రమం యథావిధిగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని డివిజనల్, మండల, మున్సిపల్ కార్యాలయాల్లోను 'స్పందన' సోమవారం ఉదయం 10 గంటల నుంచి యథావిధిగా నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఫిర్యాదుదారులు మాస్కు తప్పనిసరిగా ధరించి భౌతిక దూరం పాటించాలని సూచించారు.

చింతలపూడి మండలంలో ఈదురు గాలులకు విరిగిపడిన విద్యుత్ స్తంభం, నేలకొరిగిన చెట్టు

ఈదురుగాలులు.. చిరు జల్లులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలవ్యాప్తంగా ఆదివారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారింది. అప్పటి వరకు నిప్పులు కురిపించిన భానుడు శాంతించాడు. సాయంత్రం సమయంలో ఒక్కసారిగా ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గాలులకు రహదారులపై చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అకాల వర్షం ధాటికి రైతాంగం తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మొక్కజొన్న, వేరుశనగ, వరి, మామిడి పంటలు దెబ్బతిన్నాయి. పంట చేతికొచ్చే సమయానికి భారీ ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం కురవడంతో చేసేదేమీ లేక కళ్లాల్లో ఉన్న పంటను బరకాలతో కప్పి కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.

చింతలపూడి: మండలంలో అకాల వర్షం, ఈదురుగాలుల వల్ల చెట్ల కొమ్మలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. గాలుల తీవ్రతకు అంథోని నగర్ వద్ద చెట్లు రోడ్డుపై పడటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది.

ఘనంగా ఎన్‌టిఆర్ శతజయంత్యుత్సవాలు


భీమడోలులో..

ప్రజాశక్తి - కలిదిండి

ఎన్‌టిఆర్ శత జయంతి వేడుకల్లో భాగంగా మండలంలోని వెంకటాపురం, గోపాలపురం, కొండూరు, మూలలంక, పడమటిపాలెం, ఎస్ఆర్‌పి అగ్రహారం, కొండంగి, కలిదిండి గ్రామాల్లోని ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేకులు కట్ చేసి. స్వీట్లు పంచారు. టిడిపి మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, ఎఎంసి మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస చౌదరి, సర్పంచులు గూడవల్లి శ్రీనివాసరావు, పరసా వెంకట స్వామి, నాయకులు లంకా రత్నారావు, మేకా భోగేశ్వరరావు, విజయ్, నున్న సుబ్రహ్మణ్యం, వల్లభనేని సత్యన్నారాయణ, కురేళ్ల ఏడుకొండలు, పేరం ప్రసాద్, సానబోయిన విష్ణు పాల్గొన్నారు.

టి.నరసాపురం : నందమూరి తారక రామారావు శతజయంతి వేడుకలు టిడిపి ఆధ్వర్యంలో మండలంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాజుపోతేపల్లి, బందంచర్ల, ఏపిగుంట, తిరుమలదేవిపేట, మక్కినవారిగూడెం గ్రామాల్లో ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వీట్లు పంపిణీ చేసి ఆయన రాష్ట్రానికి చేసి సేవలను కొనియాడారు. అనంతరం రాజమండ్రిలో జరిగే మహానాడుకు మండలం నుండి అధిక సంఖ్యలో తరలి వెళ్ళారు. ఈ కార్యక్రమంలో నల్లూరి వెంకట చలపతిరావు, ఆచంట సూర్యనారాయణ, తోట లక్ష్మీనారాయణ, వాసిరెడ్డి మోహన్‌రావు, ఆచంట అనిల్ కుమార్, కాసనేని మాధవరావు, సందేపూడి సాయి, కొల్లి రమేష్ పాల్గొన్నారు.

భీమడోలు : మండలంలో ఎన్‌టిఆర్ జయంత్యుత్సవాలు టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. దీనిలో భాగంగా భీమడోలు సంతపేట, పంచాయతీ కార్యాలయం వద్ద, వడ్ల పట్ల, పూళ్ల గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్న గన్ని వీరాంజనేయులు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పూళ్లలో నిర్వహించిన కార్యక్రమంలో టిడిపిలో చేరేందుకు వచ్చిన కొందరికి పార్టీ కండువాలు వేసి పార్టీలోనికి ఆహ్వానించారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకులు, భీమడోలు మాజీ జెడ్‌పిటిసి సభ్యులు కరణం పెద్దిరాజు, షేక్ మీరా, దూసనపూడి పుల్లయ్య నాయుడు, పట్నాల వెంకటేష్‌ను సత్కరించారు.

ముదినేపల్లి : ఎన్‌టిఆర్ శతజయంతి వేడుకలు మండలంలో ఘనంగా జరిగాయి. స్థానిక వై కూడలి వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి యువనేత కొడాలి వినోద్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని చిగురుకోట, అల్లూరు, గురజ, చేవూరు, వైవాక, పెదపాలపర్రు, కోడూరు తదితర గ్రామాల్లోని ఎన్‌టిఆర్ విగ్రహాలకు టిడిపి నేతలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బొర్రా చలమయ్య, పంతగాని సురేష్, వి.నరసింహారావు, బొంగు రవికుమార్, కె.విఠల్, పి.పాండురంగారావు, పి.విశ్వేశ్వరరావు, బి.బాలాజీ, ఎల్.భానుప్రసాద్, బి.రవి పాల్గొన్నారు.

చాట్రాయి : నందమూరి తారక రామారావు శతజయంతి వేడుకలను మండలంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. చాట్రాయిలో పార్టీ గ్రామ అధ్యక్షులు గడ్డం ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి కోట జోషి, కంచర్ల హనుమంతరావు, ఎలికే వెంకటేశ్వరరావు, నాగిరెడ్డి, కంపసాటి సర్వేశ్వరరావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పోలవరం గ్రామంలో ఎర్ర హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు.

జంగారెడ్డిగూడెం : పట్టణం, మండలంలో ఎన్‌టిఆర్ శతజయంతి వేడుకలను టిడిపి నేతలు ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణంలోని బైపాస్ రోడ్డులో చెరుకూరి శ్రీధర్ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అలాగే కేక్ కట్ చేసి నివాళులర్పించారు. టిడిపి సీనియర్ నాయకులు అల్లూరి రామకృష్ణ, మానికల వెంకటేశ్వరావు, గెడా సుబ్రహ్మణ్యం, పాకనాటి అంజిబాబు, చిత్తపురి దుర్గేష్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే అశ్వారావుపేట రోడ్డులోని ఎన్‌టిఆర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజమండ్రిలో జరిగే మహానాడుకు నాయకులు, కార్యకర్తలు కారులు, ఆటోలలో అధికసంఖ్యలో తరలివెళ్లారు.

ఆగిరిపల్లి: ఎన్‌టిఆర్ శతజయంతి సందర్భంగా ఆదివారం ఆగిరిపల్లి మెయిన్‌సెంటర్‌లో టిడిపి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఆగిరిపల్లి గ్రామ అధ్యక్షులు పామర్తి నరసింహారావు, నాయకులు ఎం.సత్యకుమార్, ఆర్.నాగమణి, బి.శ్రీనివాసరావు, ఎం.శ్రావణ్‌కుమార్, టి.ఆదినారాయణ, చంటి పాల్గొన్నారు.

ఆగిరిపల్లిలో..


సంతాప సభలో మాట్లాడుతున్న మంతెన సీతారాం

పట్నాల శ్రీనివాసరావు ధన్యజీవి

సంతాప సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం, కేశవరం ప్రాంతాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి 40 సంవత్సరాల పాటు అవిశ్రాంత పోరాటం చేసిన పట్నాల శ్రీనివాసరావు ధన్యజీవి అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం అన్నారు. ఆదివారం సరిపల్లిలోని ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో జరిగిన శ్రీనివాసరావు సంతాప సభకు ఆ పార్టీ మండల కార్యదర్శి పి.నరసింహమూర్తి అధ్యక్షత వహించారు. సభలో తొలుత శ్రీనివాసరావు చిత్రపటానికి మంతెన సీతారాం పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. అనంతరం సీతారాం మాట్లాడుతూ శ్రీనివాసరావు తన చేతి వృత్తి చేసుకుంటూ ప్రజాఉద్యమాల్లో అగ్రభాగాన నిలిచాడన్నారు. కేశవరం, పిప్పర ప్రాంతాల్లో పార్టీ, ప్రజాసంఘాల నిర్మాణంలో స్థానిక పెత్తందార్లను ఎదిరించి ముందుకు సాగాడని కొనియాడారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రీనివాస్ తపించేవారని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని అన్నారు.

జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు మాట్లాడుతూ గణపవరం ప్రాంతంలో కార్మికోద్యమం నిర్మాణంలో శ్రీనివాస్ పాత్ర చిరస్మరణీయమన్నారు. సభలో సిపిఎం ఏలూరు జిల్లా నాయకులు గుడిపాటి నరసింహారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు కె.సోమరాజు, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు షేక్ వలీ, సిపిఎం నేత పి.గోవింద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.పెంటారావు, ఎస్.సంజీవరావు, గుత్తుల శ్రీను, చిన్న నాగేశ్వరరావు పాల్గొన్నారు.

భీమడోలులో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరం

వేసవి శిక్షణా శిబిరాలు వినియోగించుకోండి

ప్రజాశక్తి - భీమడోలు

గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం సేవలను వినియోగించుకోవాలని స్థానిక స్వచ్ఛంద సంస్థ సత్యం ఫౌండేషన్ ఛైర్మన్ బాలనాగు విజయసారథి కోరారు. స్థానిక శాఖ గ్రంథ పాలకులు కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం సేవలు ఆదివారానికి 21వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా సత్యం ఫౌండేషన్ ఛైర్మన్ మాట్లాడుతూ గతంలో శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గ్రంథాలయానికి వచ్చే విద్యార్థుల సంఖ్య పెరిగిందని, దానికి గ్రంథాలయాల పట్ల ఆసక్తి పెంచేందుకు తమ సంస్థ ద్వారా ఎంపిక చేసిన విద్యార్థులను, పాఠకులను విజయవాడలో నిర్వహించిన పుస్తక ప్రదర్శనకు తీసుకువెళ్లి అక్కడ వారు ఎంపిక చేసుకున్న పుస్తకాలను కొనుగోలు చేసి బహూకరించామన్నారు. ఆదేవిధంగా గ్రంథాలయ అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించిన పలువురు ప్రముఖులు నీతి కథలు, పలువురు ప్రముఖుల జీవిత విశేషాలతో పాటు నేటి తాజా వార్తా ఉన్న కొత్త పార్లమెంటు భవనం పూర్వాపరాలు, వాటిపై పలువురు అభిప్రాయాలను చదివి వినిపించారు. వాటిపై విద్యార్థులతో సమీక్షలు చేపట్టారు. అనంతరం విద్యార్థులు చిత్రలేఖనం నేర్చుకోవడం ,ఇతర అంశాల గురించి తెలుసుకోవడం, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు.

ముదినేపల్లి: ముదినేపల్లి గ్రేడ్-3 శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు ఆదివారానికి 21వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా విద్యార్థులతో ముందుగా నీతి కథలు చదివించారు. కరీమున్నీసాచే విద్యార్థులకు కథలు చెప్పారు. విరామ సమయం అనంతరం ఇండోర్ గేమ్స్, క్యారం, చెస్, వాలీబాల్, రింగ్ తదితర ఆటలు ఆడించారు. గ్రంథాలయాధికారిణి ఎం..శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్‌లో అభిషేక్‌కు ఐదో స్థానం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం


పురస్కారంతో అభిషేక్

ఇటీవల ముంబాయిలో జరిగిన ఐసిఎన్‌జెబిటి బాడీ బిల్డింగ్ జాతీయ పోటీల్లో జంగారెడ్డిగూడెం గోల్డెన్ జిమ్ స్టూడెంట్ పాటిబండ్ల అభిషేక్ ఐదో స్థానం సాధించారు. ఆదివారం అభిషేక్ తండ్రి సుదర్శన్ ఆ వివరాలను తెలిపారు. అభిషేక్ పదో తరగతి వరకూ జంగారెడ్డిగూడెంలో, ఇంటర్ విజయవాడలో, మెకానికల్ ఇంజినీరింగ్ గుంటూరులో చదివారు. ప్రస్తుతం హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తున్నట్లు తెలిపారు. గతంలో జంగారెడ్డిగూడెం గోల్డెన్ జిమ్‌లో శిక్షణ పొంది హైదరాబాద్‌లో ఉద్యోగంలో చేరారని తెలిపారు. ఈ తరుణంలో బాడీ బిల్డింగ్ పోటీల్లో పాల్గొని విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రముఖులు, బంధువులు, మిత్రులు, పలువురు అభిషేక్ సాధించిన విజయంపై తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు.

మతాచారం ప్రకారం పార్లమెంట్ భవనం ప్రారంభం సరికాదు

ప్రజాశక్తి - ఏలూరు

నూతనంగా నిర్మించిన పార్లమెంటు భవనాన్ని ఒక మతాచారం ప్రకారం ప్రజాస్వామ్య, లౌకికరాజ్యంలో ప్రధాని మోడీ ప్రారంభించడం ఆయన రాజ్యాంగం మీద చేసిన ప్రమాణాలకు విరుద్ధమని హేతువాద సంఘం జిల్లా అధ్యక్షులు కడలి రామాంజనేయులు ఖండించారు. ఈ మేరకు ఆదివారం ఆయనొక ప్రకటన విడుదల చేశారు. మన దేశం భిన్నమతాలు, ఆచారాలు, సంస్కృతులు కలిగిన దేశమని వివరించారు. ఈ క్రమంలో పాలనలో మతపరమైన విధానాలను చొప్పించకూడదన్నారు.

రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న తహశీల్దార్

శక్తి ఫౌండేషన్ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని చనుబండ రామాలయం సెంటర్ వద్ద యువభారత్ శక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముందుగా టివి5 రిపోర్టర్ మిద్దె వీరాంజనేయులు రక్తదానం చేశారు. అనంతరం గ్రామంలోని యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమం తల సేమియా వ్యాధితో బాధపడే చిన్నారుల కోసం నిర్వహించామని తెలిపారు. ఈ శిబిరంలో తహశీల్దార్ సి.హెచ్.విశ్వనాథరావు మాట్లాడుతూ తలసేమియా చిన్నారుల కోసం యువకులందరూ ముందుకు వచ్చి రక్తదానం చేయటం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి విస్సంపల్లి జ్యోతి, జల్లేపల్లి పరమేశ్వరరావు పాల్గొన్నారు.


సమావేశమైన పూర్వ విద్యార్థులు

ఉత్సాహభరితంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి 1988 - 89 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. 34 ఏళ్ల తరువాత వారంతా అదే పాఠశాలలో కలిశారు. దీంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పటి గురువులైన పెండ్యాల వెంకటేశ్వరరావు, తోట శర్మ, ఎన్‌డివిఎస్.ప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. నాటి విద్యార్థుల్లో విశాఖ ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ దేవతత్వం, విజయవాడ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్, ఎలక్ట్రికల్ ఎడిఎ విజయభాస్కర్ పాల్గొన్నారని నిర్వాహకులు బివిఎస్.వి.ప్రసాద్, సిహెచ్.దినేష్, బుర్ర వెంకటేశ్వరరావు, పెద్దిరెడ్డి దానయ్య, ఎన్.సత్యనారాయణ, ఎం.దినేష్‌చంద్ర తెలిపారు. తాము చదువుకున్న పాఠశాలలో అందరం ఒకే చోట కలవడం పండుగ వాతావరణాన్ని తలపించిందని పూర్వ విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీ సహాయకుల ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

నూజివీడు రూరల్: నూజివీడు పట్టణ పరిధిలోని కోనేరుపేట (ఓపెన్ కేటగిరి), ఆగిరిపల్లి మండలం కిష్టారం-2(ఎస్‌సి రిజర్వు) అంగన్వాడీ కేంద్రాల్లో సహాయకురాలి ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామని నూజివీడు సిడిపిఒ సూరాని తెలిపారు. పదో తరగతి పాసైన మహిళలు ఈ ఉద్యోగాలకు అర్హులని ఆమె పేర్కొన్నారు. అర్హత కలిగిన స్థానిక వివాహిత మహిళలు జూన్ రెండో తేదీలోపు నూజివీడు ఐసిడిఎస్ కార్యాలయంలో ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఉత్తమ ర్యాంకులు, అత్యుత్తమ బోధన.. శ్రీవెంకటేశ్వర సొంతం

ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్లు సింగిరెడ్డి సత్యనారాయణ, కానూరి నాగేశ్వరావు, జి.శ్రీధర్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మెట్టప్రాంతంలో అత్యుత్తమ ర్యాంకులు సాధించడం శ్రీవెంటేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ సొంతమని ఆ సంస్థ డైరెక్టర్లు సింగిరెడ్డి సత్యనారాయణ, కానూరి నాగేశ్వరావు, జి.శ్రీధర్ తెలిపారు. గత పదేళ్లుగా మెట్టప్రాంతంలో అత్యుత్తమ విద్యనందిస్తూ పాఠశాల, కళాశాల విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఇటీవల విద్యాసంస్థల విస్తరణ నేపథ్యంలో మహిళలకు ప్రత్యేక కళాశాల ఏర్పాటుతో శ్రీవెంకటేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ మెట్టప్రాంతంతో పాటు ఇతర ప్రాంతాల ప్రజల మన్ననలు పొందిందని పేర్కొన్నారు. ప్రధానంగా ఐఐటి, జెఇఇ, నీట్ వంటి పోటీ పరీక్షలకు మెట్టప్రాంత విద్యార్థులను తయారు చేసిన ఘనత శ్రీవెంకటేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీకి దక్కుతుందని తెలిపారు. సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా కార్పొరేట్ తరహాలో నాణ్యమైన విద్యనందిస్తున్న ఏకైక సంస్థగా తల్లిదండ్రుల మన్ననలు పొందడం హర్షణీయమన్నారు. 2023 ఐఐటి, జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో శ్రీవెంకటేశ్వర ఎడ్యుకేషనల్ విద్యాసంస్థల విద్యార్థులు ఆలిండియా స్థాయిలో ర్యాంకులు సాధించారని తెలిపారు. ఎం.వెంకటదీపక్ ఆలిండియ స్థాయిలో 196వ ర్యాంకు, డి.ప్రేమ్‌చంద్ 509, బి.రోహిత్‌కుమార్ 1100, జె.నాగసాయికృష్ణ 2153 ర్యాంకులు సాధించారని తెలిపారు.

2023 సీనియర్ ఇంటర్ ఫలితాల్లో కె.శ్రీహర్షిత, 988 బైపిసి, పిఎస్‌పి వర్షిత 984 ఎంపిసి, బి.కాశీదుర్గ 935 సిఇసిలో అత్యధిక మార్కులు సాధించారని తెలిపారు. 2022 ఐఐటి, జెఇఇలో తమ కళాశాల విద్యార్థిని

శ్రీవెంకటేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ భవనం

మెయిన్స్‌లో ర్యాంకులు సాధించిన వెంకటదీపక్, ప్రేమ్‌చంద్

ఎస్.నాగదీప్తి ఆలిండియా మూడో ర్యాంకు సాధించి ఐఐటి చెన్నైలో సీటు సాధించారని తెలిపారు.

అలాగే శ్రీవెంకటేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీలో బాగమైన అక్షర హైస్కూల్ నుండి 2023 పదో తరగతి ఫలితాల్లో డి.సింధు 586 మార్కులు, జి.శ్రీనాధ్ 586 మార్కులు సాధించారని తెలిపారు. మెట్టప్రాతంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యనిందించడానికి అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ, అధ్యాపక సిబ్బందితో నిరంతర శిక్షణ, కృషి వల్ల నూరుశాతం ఉత్తీర్ణతతో శ్రీవెంకటేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రత్యేకతను చాటుకుందని డైరెక్టర్లు తెలిపారు.

2023-2024 విద్యా సంవత్సరం నుండి శ్రీవెంకటేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ నూతన భవనంలో తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అడ్మిషన్లు జరుగుతున్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం శ్రీవెంకటేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీని సంప్రదించాలని సూచించారు.

పోలవరం నుంచి బయలుదేరుతున్న నేతలు

మహానాడుకు తరలిన టిడిపి నేతలు

ప్రజాశక్తి - పోలవరం

రాజమహేంద్రవరంలో జరుగుతున్న టిడిపి మహానాడు కార్యక్రమానికి ఆదివారం పోలవరం నుండి టిడిపి నాయకులు కార్యకర్తలు వందలాదిగా తరలి వెళ్లారు. టిడిపి క్లస్టర్ మాజీ ఉపసర్పంచ్ మంగినకొండ ఆధ్వర్యంలో 25 కార్లు, 25 బైకులపై సుమారు 200 మంది నాయకులు, కార్యకర్తలు అభిమానులు తరలి వెళ్లారు. తొలుత స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి మండల అధ్యక్షులు బొడ్డు కృష్ణ, ఎఎంసి మాజీ వైస్ ఛైర్మన్ కుంచే దొరబాబు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. జోహార్ ఎన్‌టిఆర్ అంటూ నినాదాలు చేస్తూ స్థానిక ఏటిగట్టు సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జల్లేపల్లి రాజా, ఆకుల రాజా, సారిక ఉదయ్, ఎస్ కె.రబ్బాని, మిరియాల అంజి, పిల్లి నాగరాజు, పోతుల శ్రీను, పాదం శ్రీను, కొండే ఏసు పాల్గొన్నారు.

రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని పల్లెర్లమూడిలో కోనేరు వద్ద రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు ఆదివారం సర్పంచి పులపాక సౌమ్య రేఖ, ఎంపిటిసి చిలుకూరి ఆనూర్ భాష ప్రారంభించారు. సీతారామపురం ఎంకె రహదారి వద్ద నుండి బొమ్ములూరు జాతీయ రహదారి వరకూ రహదారి విస్తరణ పనులుకు గాను ప్రభుత్వం రూ.23 కోట్లను మంజూరు చేసింది. దీనిలో భాగంగా గ్రామంలో రిటైనింగ్ వాల్ సైతం నిర్మించాల్సి ఉండటంతో ఈ పనులు ప్రారంభించారు.


ఆంజనేయులును సత్కరిస్తున్న నాయకులు

బూరుగుపల్లి సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి - ఉంగుటూరు

చేబ్రోలు రైల్వే ట్రాక్ వద్ద అండర్ పాస్ సిమెంటు రోడ్డును నిర్మించి వేలాది మంది ప్రజలకు ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపిన చేబ్రోలుకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త బూరుగుపల్లి ఆంజనేయులు, ఆయన కుమారుడు నాగేంద్ర ఆదర్శనీయులని మానవత సంస్థ రీజియన్ ఛైర్మన్ పుప్పాల గోపీ అన్నారు. ఆదివారం మానవత మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆంజనేయులు, నాగేంద్రను సత్కరించారు. ఇటీవల గుండెపోటుతో మరణించిన గంటా గోపీ కుటుంబానికి రూ.5 వేలు, పేద విద్యార్థి చల్లా ఏంజిల్ ఇంటర్ చదువుకు ఆర్థిక సాయం అందించేందుకు కమిటీ నిర్ణయం తీసుకుంది. మానవత నాయకులు గుణ్ణం బుల్లెబ్బాయి, బొమ్మిడి అప్పారావు, అడపా శ్రీను, శీతాల సత్యనారాయణ, గంజి రవి పాల్గొన్నారు.

వాలంటీర్ల సేవలు ఎనలేనివి : ఎంఎల్ఎ డిఎన్ఆర్

ప్రజాశక్తి - మండవల్లి



కైకలూరులో వాలంటీర్లకు పురస్కారం అందిస్తున్న ఎంఎల్ఎ డిఎన్ఆర్

ప్రజలకు విశేష సేవలందిస్తున్న వాలంటీర్లకు ప్రభుత్వ అందిస్తున్న ప్రోత్సాహలను సద్వినియోగం చేసుకుని, మరిన్ని సేవలు అందించాలని కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావు (డిఎన్ఆర్) సూచించారు.స్థానిక మార్కెట్ యార్డులో ఆదివారం వాలంటీర్లకు పురస్కారాల పంపిణీలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సేవారత్న, సేవా వజ్ర, సేవా మిత్రలుగా పురస్కారాలు అందుకున్న వాలంటీర్లను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. జగనన్న వారియర్లుగా వాలంటీర్లు అందిస్తున్న సేవలు ఎనలేనివన్నారు. వాలంటీర్ల సేవలను గుర్తించి గత మూడేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం సన్మానించి పురస్కారాలను అందిస్తుందన్నారు. రానున్న రోజుల్లో సచివాలయ కన్వీనర్లు గృహ సారథులతో ముందుకు సాగుతూ మరిన్ని మెరుగైన సేవలందించి ప్రభుత్వానికి కీర్తిప్రతిష్టలు తీసుకురావాలని ఆయన కోరారు. అనంతరం 16 సచివాలయాల్లో పనిచేస్తున్న వాలంటీర్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామదుర్గ ప్రసాద్, జెడ్‌పిటిసి సభ్యురాలు ముంగర విజయనిర్మల, పార్టీ మండల అధ్యక్షులు గుమ్మడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపిపి అగస్తి ఆదివిష్ణు, పిఎసిఎస్ సర్పంచి మెండ జాన్సీ, అధ్యక్షులు బొమ్మనబోయిన గోకర్ణ యాదవ్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు బేతపూడి ఏసేవరాజు, ముంగర మల్లికార్జునరావు, వైసిపి వైఎస్ఆర్ సేవాదళ్ అధ్యక్షులు నాగరాజు, ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు వాలంటీర్లు పాల్గొన్నారు.

చింతలపూడి: కరోనా వంటి విపత్కర సమయంలో సైతం వాలంటీర్లు సమాజానికి ఎనలేని సేవ చేశారని ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా కొనియాడారు. పట్టణంలోని ఆర్ఆర్ ఫంక్షన్ హాలులో వాలంటీర్లకు పురస్కారాలను ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. 2024లోనూ వైసిపి విజయం సాధిస్తుందన్నారు. దీనికోసం వాలంటీర్ల సహకారం కూడా అవసరమన్నారు. అనంతరం వాలంటీర్లకు సేవారత్న, సేవా వజ్ర, సేవా మిత్ర పురస్కారాలు అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి, జెడ్‌పిటిసి సభ్యులు ములుగుమాటి నీరజ, వైసిపి నగర అధ్యక్షులు కొప్పుల నాగు, మండల సర్పంచుల ఛాంబర్ నగర కమిషనర్, ఎంపిడిఒ పాల్గొన్నారు.


చింతలపూడిలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా

పేద విద్యార్థులకు మానవత సాయం

ప్రజాశక్తి - భీమడోలు

ప్రతిభా విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తున్న మానవత సభ్యులు

ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహించడంతో పాటు, విద్యాభ్యాసం కొనసాగించేందుకు ఇబ్బందులు పడుతున్న పేద విద్యార్థులను వివిధ రూపాల్లో ఆదుకుంటున్న స్వచ్ఛంద సంస్థ మానవత భీమడోలు శాఖ సేవలను వినియోగించుకోవాలని ఆ సంస్థ జిల్లా అధ్యక్షులు రామిశెట్టి గంగాధరరావు కోరారు. స్థానిక పెన్షనర్స్ భవనంలో ఆదివారం నిర్వహించిన భీమడోలు శాఖ నెలవారీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సమావేశం అనంతరం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఇటీవల పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలస్థాయిలో ప్రథమ స్థానం దక్కించుకున్న భీమడోలు మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థి ఎన్.యామిని ప్రణీతతో పాటు గుండుగొలను శ్రీవిద్యాలయ పాఠశాలకు చెందిన ఎ.భవ్యశ్రీ, భీమడోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కె.రితికను సన్మానించారు. ఈ నేపథ్యంలో వారు ఒక్కరికి మెమెంటోలు, వెయ్యి రూపాయలు నగదు పురస్కారంతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులను సత్కరించారు. ఇదేవిధంగా విద్యాభ్యాసం కొనసాగించేందుకు ఇబ్బందులు పడుతున్న పోలసానిపల్లి గ్రామానికి చెందిన బిటెక్ విద్యార్థిని మొగల సాయిశ్రీ, బుట్టాయగూడేనికి చెందిన బిఎస్‌సి విద్యార్థి చింతల సత్యనారాయణకు హైదరాబాదుకు చెందిన ఎస్‌జిఆర్ ఎడ్యుకేషన్ అకాడమీ విద్యాసంకల్పం ప్రాజెక్టు కింద ఆ విద్యార్థులకు ల్యాప్‌ట్యాప్‌లను సంస్థ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో శాంతి రథాల జిల్లా కమిటీ అధ్యక్షులు అప్పక రాంబాబు, భీమడోలు. శాఖ ఛైర్మన్ జి.నూకరాజు, కన్వీనర్ పంచకర్ల సత్యనారాయణ, మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ యలమర్తి రవీంద్రకుమార్ పాల్గొన్నారు.

ప్రధాన రోడ్డుపై గోతులు.. పట్టని అధికారులు..!

ప్రజలకు, వాహనదారులకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి - మండవల్లి

మండలంలోని జాతీయ రహదారి అధ్వానంగా మారింది. రోడ్డుకు మధ్యలో ఏర్పడిన గోతులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. ఈ గోతులను దాటాలంటే వాహనదారులకు ప్రాణ సంకటంగా ఉంది. అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో గోతుల రోడ్డులో ప్రయాణించడానికి వాహనదారులు నానాఅవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా మండల కేంద్రమైన మండవల్లిలో రహదారి అస్తవ్యస్తంగా తయారైంది. 165వ నెంబర్ జాతీయ రహదారి పామర్రు - దిగమర్రు మండవల్లి ప్రధాన సెంటర్ వద్ద పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. రహదారి విస్తరణలో భాగంగా జాతీయ రహదారి వెంబడి గుత్తేదారుడు డ్రెయినేజీని అస్తవ్యస్తంగా నిర్మించి వదిలేశాడు. దీంతో మురుగుపారేందుకు అవకాశం లేకపోవడంతో ఆ నీరంతా ఆ గోతుల్లోకి చేరి దుర్వాసన వెదజల్లడంతోపాటు చెరువులను తలపిస్తున్నాయి. అధికారులు తూతూమంత్రంగా పనులు చేస్తున్నారు తప్పా.. శాశ్వత పరిష్కారం చూపలేకపోయారని విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో గొయ్యి ఎంతలోతు ఉందో తెలియక ఆ ప్రాంతాన్ని దాటడానికి వాహనదారులు

వణికిపోతున్నారు. నెలల తరబడి ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ అధికారులు రహదారిపై ఏర్పడిన గోతులను పూడిపించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గోతులను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

30న ఆక్వా రైతుల సమావేశం

ప్రజాశక్తి - మండవల్లి

ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఈనెల 30న నిర్వహిస్తున్న సమావేశానికి ఆక్వా రైతులు పెద్దఎత్తున పాల్గొనాలని ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చావలపాడు సిఎన్ఆర్ గార్డెన్‌లో ఈ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. కైకలూరు శాసనసభ్యులు దూలం నాగేశ్వరావు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో ముఖ్యంగా ఆక్వా రైతులకు ఇచ్చే ఐదు శాతం రిబేటుపై, చేపల రేట్లు స్థిరీకరణపై చర్చిస్తామని తెలిపారు. ఆక్వా సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలి అనేదానిపై ప్రధాన చర్చ జరుగుతుందని ఆయన వివరించారు. రైతులంతా తప్పనిసరిగా ఈ కార్యక్రమంలో పాల్గొని సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

సీతారామస్వామి (ఫైల్‌ఫొటో)

పాత్రికేయులు వేణుగోపాల్‌కు పితృవియోగం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల ఆంధ్రజ్యోతి విలేకరి నైనవరపు వేణుగోపాల్‌కు పితృవియోగం జరిగింది. ఆయన తండ్రి రిటైర్డ్ ఉపాధ్యాయులు నైనవరపు సీతారామస్వామి(78) అనారోగ్య సమస్యలతో ఆదివారం ఆగిరిపల్లిలోని ఆయన స్వగృహంలో మృతిచెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. సీతారామస్వామి భౌతికకాయాన్ని పలు పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, విలేకర్లు సందర్శించి, ఆయన కుటుంబానికి ప్రగాఢసానుభూతిని తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - కైకలూరు

వైఎస్ఆర్ జగనన్న గ్రీన్ విలేజ్‌లోని ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు కోరారు. ఆదివారం ఆయన కాలనీలోని ఇళ్ల పురోగతిని పరిశీలించారు. లబ్ధిదారులకు, అధికారులు పలు సూచనలు చేశారు.

పసికందు మృతి

ప్రజాశక్తి - చింతలపూడి

పేగు మెడలో వేసుకుని జన్మించిన పసికందు కొద్ది గంటల్లోనే మృత్యువాత పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. చింతలపూడి ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రసూల్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన వి.చాందినికి ఆదివారం తెల్లవారుజామున ఐదున్నర గంటల ప్రాంతంలో ప్రసవమైంది. బిడ్డ పేగు మెడలో వేసుకుని జన్మించడం, ఆపై ఆరోగ్య పరిస్థితి ఇబ్బందికరంగా ఉండటంతో మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరు జిల్లా ఆసుపత్రికి సిఫార్సు చేశామని రసూల్ తెలిపారు. ఏలూరు ఆస్పత్రికి తీసుకెళ్లాక పరిస్థితి విషమించి బిడ్డ మరణించినట్లు వివరించారు.

నేరాలు - ఘోరాలు

బోల్తా పడిన కారు, గాయపడిన నాయకులు

టిడిపి నేతల కారు బోల్తా

పలువురికి గాయాలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

రాజమహేంద్రవరంలో జరుగుతున్న టిడిపి మహానాడుకు వెళ్తున్న ఓ కారు మండలంలోని బాదంపూడి దత్తాశ్రమం సమీపంలో ఆదివారం ప్రమాదానికి గురైంది. వివరాలిలా ఉన్నాయి. దెందులూరుకు చెందిన పలువురు టిడిపి కార్యకర్తలు, నాయకులు కారులో బయలుదేరారు. బాదంపూడి వద్ద కారు అదుపుతప్పి పక్కన లోతట్టు ప్రాంతంలోకి వెళ్లి బోల్తాపడింది. కారులో ఉన్నవారికి గాయాలు కావడంతో 108 అంబులెన్సులో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని లక్ష్మీపురం శివారులో పేకాట శిబిరంపై ఎస్ఐ వి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.12,800 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.